# ఆదిలాబాద్ వార్త

మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

ఆదివారం 14, సెప్టెంబర్ 2025






ఆత్మహత్యకు పాల్పడ్డ సుప్రియ (ఫైల్)

### బడికి పొమ్మన్నందుకు

## బాలిక ఆత్మహత్య

**బెల్లంపల్లి, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త**

బడికి వెళ్ళి చదువుకో బిడ్డా అంటూ ఓ బాలికను తల్లి దండ్రులు మందలించడంతో ఆ బాలిక ఎలుకలు, పందికొక్కులను నివారించేందుకు వినియోగించే మందును త్రాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలం ఆకెనపల్లి గ్రామంలో శనివారం తెల్ల వారుజమున జరిగింది. గ్రామానికి చెందిన ఎగ్గేవార్ రామాజీ లక్ష్మీ రెండోవ కూతురు ఎగ్గేవార్ సుప్రియ (14) శనివారం తెల్లవారుజామున నాలుగు గంటల ప్రాంతంలో తల్లిదండ్రులు నిద్రిస్తుండగా బాత్రూంలో ఉన్న పంది కొక్కులకు, ఎలుకల నివారించేందుకు పెట్టే మందు సేవించింది. కొద్ది సేప టికి సుప్రియకు వాంతులు అయ్యాయి. కుటుంబీకులు లేచిచూసేసరికి అస్వ స్థగురైనట్టుగా ఉండడంతో గమనించిన కుటుంబీకులు సుప్రియను బెల్లంపల్లి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తీసుకువెళ్లారు. పరీక్షించిన వైద్యులు మెరుగైన చికిత్స కోసం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేశారు. చికిత్స పొందుతూ సుప్రియ మృతి చెందింది. కాగా సుప్రియ **మిగతా 2లో..**

# నలుగురు జల సమాధి..



- నలుగురి ప్రాణాలు తీసిన ఖాళీ యూరియా సంచి..
- తల్లి, కొడుకు, ఇద్దరు బాలికలు మృతి

**వాంకిడి, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త**

*కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లాలోని వాంకిడి మండలం దాబా గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. శనివారం నాలుగురు చికిలి వాగులో జల సమాధి అయ్యారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం దాభా గ్రామానికి చెందిన మొహర్లె నిర్మల (30), ఆమె కుమారుడు మొహర్లే గణేష్ (12), బంధువుల బాలికలు వడై మహేశ్వరి (10), అదే శశికళ (10) నీటి కుంటలో పడి దుర్మరణం చెందడం జరిగింది. వివరాల్లోకి వెళితే నిర్మల ఖాళీ యూరియా సంచులను కడగడానికి స్థానిక చికిలీ వాగుకు వెళ్లిందని ఆమెతో పాటు ఆమె కుమారుడు, ఇతర బంధువుల బాలికలు వెళ్లినట్లు తధానంతరం ఖాళీ సంచులు కడుగుతున్న క్రమంలో గణేష్ కడుగుతున్నటువంటి ఖాళీ సంచి నీటిప్రవాహంలో వెలుతుండటంతో దాని తెచ్చే క్రమంలో కుంటలో గల్లంతు కావడం జరిగింది. ఇది గమనించిన తల్లి బాబును తీసే క్రమంలో ఆమె కూడా గల్లంతయినట్లు ఇద్దరు బాలికలు కూడా ఆమె వెంటనే వెళ్లి గల్లంతయ్యారని తెలిపారు. అక్కడే ఒడ్డు మీద ఉన్న ఒక బాలిక సంఘటనను గమనించి స్థానికులకు సమాచారం ఇవ్వడంతో గ్రామస్తులు వచ్చి మృతదేహాలను వెలికి తీసినట్లు తెలిపారు. రెండవ శనివారం పాఠశాలకు సెలవు దినం కావడంతో పిల్లలు వాగుకు వెళ్లి మృతి చెందినట్లు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. నలుగురు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.*



నిర్మలబాయి, శశికళ, గణేష్, వాడై మహేశ్వరీ (ఫైల్ ఫోటోలు)

# సమస్యలను సామరస్యంతో పరిష్కరించుకోవాలి

- ★ మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**నస్పూర్, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త**

సమస్యలను సామరస్యంతో పరిష్కరించుకోవాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో డిసిపి ఎ.భాస్కర్‌తో కలిసి దండేపల్లి మండలం దమ్మన్నపేట గ్రామ గిరిజనులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మంచిర్యాల జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, సమస్యలను సామరస్యంతో పరిష్కరించుకోవాలని, దాడులకు పాల్పడకూడదని తెలిపారు. ఈ నెల 12వ తేదీన దండేపల్లి మండలం దమ్మన్నపేట, మామిడిగూడ గ్రామాలలో జరిగిన ఘటనపై దమ్మన్నపేట గ్రామ గిరిజనులతో సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా సామరస్యంతో ముందుకు వెళ్లాలని సూచించారు. అటవీ ప్రాంతాలలో కమ్యూనిటీ ఫారెస్ట్ మేనేజ్మెంట్ క్రింద గిరిజనులు వెదురు పంట సాగుకు ప్రోత్సహించడం జరుగుతుందని తెలిపారు. అటవీ ప్రాంతాలలోని గిరిజనులు అటవీ భూములలో వెదురు పంట సాగు చేసేందుకు గుంతలు త్రవ్వడం, మొక్కలకు నీటిని అందించడం, యూరియా ఇతర పనులకు నిధులు మంజూరు చేయడమే కాకుండా వెదురు పంటను విక్రయించుకుని ఆదాయం పొందేందుకు అవకాశం కల్పించడం జరుగుతుందని తెలిపారు. గిరిజనుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని, గిరిజనులు ఆర్థికంగా ఎదిగేందుకు చేయూత అందించడం జరుగుతుందని తెలిపారు. గిరిజనుల సమస్యల పరిష్కారం కోసం అధికార యంత్రాంగం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, భౌతిక దాడులకు పాల్పడవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, గిరిజనుల ప్రతినిధులు పాల్గొన్నారు.

### ప్రజా సంక్షేమం, అభివృద్ధిపై

# ప్రత్యేక దృష్టి

- రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖామంత్రి గడ్డం వివేకానంద

**మంచిర్యాల, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త**

రాష్ట్ర అభివృద్ధిలో భాగంగా చెన్నూర్ నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖామంత్రి గడ్డం వివేకానంద తెలిపారు. శనివారం జిల్లాలోని చెన్నూర్ మున్సిపల్ పరిధిలో రోడ్డు నిర్మాణ పనులకు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, చెన్నూరు మండల తహసిల్దార్ మల్లికార్జునలతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని తెలిపారు. ఈ క్రమంలో చెన్నూర్ మున్సిపల్ పరిధిలోని 14వ వార్డులోని పోలబోయిన రమేష్ ఇంటి నుండి పోలోజి సత్యం ఇంటి వరకు అంచనా విలువ 6 లక్షల 80 వేల రూపాయల డిఎంఎఫ్‌టి నిధులతో అంతర్గత **మిగతా 2లో..**



## బడికి పొమ్మన్నందుకు బాలిక ఆత్మహత్య

*(మొదటిపేజీ తరువాయి)*

స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువుతోంది. అనారోగ్యం కారణంగా మూడు నెలలుగా స్కూలుకు వెళ్ళక పోవడంతో తల్లిదండ్రులు సుప్రియను స్కూలుకు వెళ్ళాలని మందలించడంతో శుక్రవారం స్కూలుకు వెళ్ళింది. శనివారం తెల్లవారు జామున సుప్రియ ఆత్మహత్యకు పాల్పడటం గ్రామంలో విషాదం అలుముకుంది. ఎగ్గేవార్ రామాజీ కుటుంబం కుటుంబం బతుకుదెరువు కోసం మహారాష్ట్ర లోని చంద్రాపూర్ జిల్లా బంగారతలోడి గ్రామం నుంచి పదేళ్ల క్రితం ఆకెనపల్లికి వచ్చి స్థిరపడ్డారు. రామాజీకి ముగ్గురు కూతుళ్లు కాగా రెండోవ కూతురు సుప్రియ ఆత్మహత్యకు పాల్పడటం చర్చనీయాంశంగా మారింది. కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బెల్లంపల్లి మండలం తాళ్లగురజాల పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రజా సంక్షేమం, అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

*(మొదటిపేజీ తరువాయి)*

సిసి రోడ్డు నిర్మాణం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ప్రజా సంక్షేమంలో భాగంగా ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ ఆరోగ్యశ్రీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రైతు భరోసా పథకాలతో పాటు మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా స్వయం సహాయక సంఘాలకు రుణ సదుపాయం కల్పించడంతో పాటు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 500 రూపాయలకు రాయితీ గ్యాస్ సిలిండర్ అందించడం జరుగుతుందని తెలిపారు. చెన్నూరు నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని, అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అనంతరం చెన్నూర్ మండల కేంద్రంలో గల గోదావరి పుష్కర ఘాట్‌ను పరిశీలించారు. 2027లో జరగనున్న గోదావరి పుష్కరాల సందర్భంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టిందని తెలిపారు. పుష్కర ఘాట్ ప్రాంతంలో త్రాగునీరు, పారిశుధ్యం, తాత్కాలిక గదులు, వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, అత్యవసర వైద్య సేవలు ఇతర అన్ని అంశాలను పరిగణలోకి తీసుకుంటూ ఏర్పాట్లు చేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. వృద్ధులు పుష్కర ఘాట్ వరకు వెళ్లేందుకు ప్రత్యేక ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఇతరులు ఎవరైనా వాహన పార్కింగ్ ప్రాంతంలో వాహనాలు నిలిపి నడక ద్వారా పుష్కర ఘాట్‌కు చేరుకునే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. పుష్కరాల నిర్వహణలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రబీ సిఎంఆర్ లక్ష్యాలను అక్టోబర్ 31వ తేదీలోగా పూర్తి చేయాలి

**- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

నస్పూర్, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త

2024-25 రబీ సీజన్‌కు సంబంధించిన సి. ఎం. ఆర్. లక్ష్యాలను అక్టోబర్ 31వ తేదీలోగా పూర్తి చేయాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళలతో కలిసి అధికారులు, రైస్ మిల్లర్ల సంఘం ప్రతినిధులు, రైస్ మిల్లర్లతో సిఎంఆర్ లక్ష్యాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంచిర్యాల జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, 2024-25 రబీ సీజన్‌కు సంబంధించిన సిఎంఆర్ లక్ష్యాలను అక్టోబర్ 31వ తేదీలోగా పూర్తి చేసే విధంగా అధికారులు, రైస్ మిల్లర్లు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. రైస్ మిల్లర్లు తమకు కేటాయించిన ధాన్యాన్ని ప్రతి రోజు మిల్లింగ్ చేసి సిఎంఆర్. చేయాలని, గడువులోగా సిఎంఆర్ లక్ష్యాలు పూర్తి చేయని రైస్ మిల్లులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, రైస్ మిల్లర్ల సంఘం ప్రతినిధులు, రైస్ మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి వివేక్‌ను కలిసిన మందమర్రి జిఎం

బెల్లంపల్లి, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త



మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ శనివారం రోజున చెన్నూర్ ఎమ్మెల్యే, మంత్రి వివేక్ వెంకటస్వామిని మంచిర్యాల క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందచేసారు. ఈ సందర్భంగా మందమర్రి ఏరియా యొక్క స్థితి గతులను జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ మంత్రి వివేక్ వెంకటస్వామికి వివరించటం జరిగింది.

# మత్స్యశాఖ మహిళా సంఘాలకు ప్రభుత్వం చేయూత

**- రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద**

నస్పూర్, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త




ప్రభుత్వం మహిళల ఆర్థిక అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ జిల్లాలోని మత్స్యశాఖ మహిళా సంఘాలకు చేయూత అందించడం జరుగుతుందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద తెలిపారు. శనివారం జిల్లాలోని భీమారం మండల కేంద్రంలో గల మత్స్య పారిశ్రామిక సహకార సంఘం భవనంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా మత్స్యశాఖ అధికారి అవినాష్ లతో కలిసి మత్స్యకారులకు ప్రొసీడింగ్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని రంగాలను అభివృద్ధి చేయడంతో పాటు మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా ఇందిరా మహిళా శక్తి పథకం, మహాలక్ష్మి, ఇందిరమ్మ ఇండ్లు ఇతర కార్యక్రమాల ద్వారా ప్రోత్సహించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని భీమారం మండల కేంద్రంలో మత్స్యశాఖ మహిళా సహకార సంఘాన్ని ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని, ప్రతిపాదిత మహిళా సహకార సంఘాన్ని తెలంగాణ సహకార సంఘాల చట్టం 1964 ప్రకారం నిబంధనలకు లోబడి రిజిస్ట్రేషన్ చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలో 132 సంఘాలు నమోదు అయి ఉన్నాయని, సంఘ సభ్యులు ఎవరైనా ప్రమాదవశాత్తు చనిపోతే ప్రభుత్వం 5 లక్షల రూపాయల వరకు ప్రమాద భీమా సౌకర్యం కల్పించడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో మత్స్యకారుల మహిళా సంఘాలకు ప్రభుత్వం 21 వేల కోట్ల రూపాయలు కేటాయించిందని తెలిపారు. రేషన్ కార్డుదారులకు రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేసేందుకు 12 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసిందని తెలిపారు. ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కొరకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని, అధికార యంత్రాంగం సమన్వయంతో సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి లబ్ధిదారులకు అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం 134 మంది మత్స్యకార సహకార సంఘ సభ్యులకు ప్రొసీడింగ్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మిగిలిన సీట్లకు 15,16 తేదీలలో స్పాట్ అడ్మిషన్లు

కాగజ్‌నగర్, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త

కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆయా గ్రూపులలో మిగిలిన సీట్లకు ఈ నెల 15,16 తేదీలలో స్పాట్ అడ్మిషన్ ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె. శ్రీదేవి తెలిపారు. కావున ఇప్పటివరకు డిగ్రీలో చేరని విద్యార్థులు ఈ చివరి అవకాశం వినియోగించుకోవాలని సూచి ంచారు. ఆసక్తిగల విద్యార్థులు తప్పనిసరి తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో నేరుగా కళాశాలకు హాజరు కావాలని సూచించారు. ఆయా విభాగాలలో మిగిలిన సీట్లను నిబంధనల మేరకు రిజర్వేషన్ కం మెరిట్ ప్రకారం భర్తీ చేయనున్నట్లు తెలిపారు. స్పాట్ అడ్మిషన్ తీసుకున్న విద్యార్థులు ఎలాంటి ఉపకార వేతనాలకు అర్హులు కారని, వీరికి ఫీరిఎంబర్స్‌మెంట్ వర్తించదని తెలిపారు. ఈ విషయాన్ని విద్యార్థులు గమనించాలని సూచించారు. విద్యార్థులు పదవ తరగతి మెమో, ఇంటర్ మెమో, టి.సి, స్టడీ సర్టిఫికేట్, కుల, ఆదాయ, రెసిడెన్షియల్ సర్టిఫికేట్లతో పాటు ఒకేషనల్ విద్యార్థులు బ్రిడ్జ్ కోర్సు సర్టిఫికేట్ వెరిఫికేషన్ నిమిత్తం సమర్పించాలని సూచించారు.



## రామకృష్ణాపూర్ సింగరేణి ఏరియా ఆసుపత్రి సందర్శించిన జిఎం

మందమర్రి, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త

మందమర్రి ఏరియాలోని రామకృష్ణాపూర్ సింగరేణి ఏరియా హాస్పిటల్‌ని సందర్శించిన ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ. ఈ సందర్భంగా ఏరియా హాస్పిటల్‌లోని పలు వార్డులను పరిశీలించారు, రోగులతో మాట్లాడారు, ప్రతి ఒక్క ఉద్యోగికి మెరుగైన వైద్యం అందించడానికి అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటామని వారు తెలియజేశారు. రోగులకు సరిపడా మందులను అందుబాటులో ఉంచుకోవాలని సంబంధిత అధికారు లకు వారు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్. ఓ. టు జి. ఎం విజయ ప్రసాద్, పర్సనల్ మేనేజర్ ఎస్. శ్యాంసుందర్, ఏరియా హాస్పిటల్ డి. వై. సీ. ఎం. వో డాక్టర్ మధు, సివిల్ ఎస్. ఇ రాము, సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ రవి, ఏరియా హాస్పిటల్ సంక్షేమ అధికారి మదర్ సాహెబ్, హాస్పిటల్ మెట్రిన్ పుష్ప, ఉద్యోగులు పాల్గొన్నారు.




## రాజీ మార్గమే రాజమార్గం

**- జిల్లా ప్రధాన న్యాయమూర్తి**

బోథ్, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త

శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా బోథ్ జూనియర్ కోర్టులో నిర్వహించిన లోక్ అదాలత్ ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్ రావు ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ, రాజీమార్గమే రాజమార్గమని తెలియజేస్తూ లోక్ అదాలత్ ప్రాముఖ్యతను తెలియజేయడం జరిగింది జూనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ చైర్మన్ సందీప్ రాజీ ద్వారా క్రిమినల్ కేసులు, 34 సివిల్ తగాదాలు, ఎక్సైజ్ కేసులు 60 క్రిమినల్ కేసులు, ఎస్టిసి కేసులు 429 పరిష్కరించడం జరిగిందనీ బోథ్, ఇచ్చోడ మండలాలకు చెందిన ఎస్బిఐ బ్యాంకుల తగాదాలు సంబంధించి 32 కేసులు పరిష్కరిస్తూ 46 లక్షల రికవరీగా రావడం జరిగిందని తెలిపారు. అనంతరం నూతన కోర్టు భవనాన్ని న్యాయమూర్తి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీధర్, లోక్ అదాలత్ బెంచ్ మెంబర్స్ ఆడెపు హరీష్, గంగాసాగర్, న్యాయవాదులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్‌ను ఆధునిక సేవల కల్పనకు చర్యలు

**- రైల్వే జిఎం ఎస్‌కే శ్రీవాత్సవ**

కాగజ్‌నగర్, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త



పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్‌ను ఆధునిక సేవల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు దక్షిణ మధ్య రైల్వే జిఎం ఎస్‌కే శ్రీవాత్సవ తెలిపారు. శనివారం కాగజ్‌నగర్ పట్టణంలో రైల్వే స్టేషన్‌ను ఆయన సందర్శించారు. రైల్వే స్టేషన్‌లోని ప్లాట్ ఫామ్, టికెట్ కౌంటర్, ఇతర వాటిని ఆయన పరిశీలించారు. సిర్పూర్ శాసనసభ్యులు డా. పాల్వాయి హరీష్ బాబు, వ్యాపారులు, రైలు యాత్ర సేవాసమితి సభ్యులు జీఎంను కలిసి వివిధ సమస్యలను వివరించారు. ప్లాట్ ఫామ్ నెం. 3ను అభివృద్ధి చేయాలని, టికెట్ కౌంటర్ ఏర్పాటుచేసి, మరుగుదొడ్ల సదుపాయం , నూతన ఫుట్ ఓవర్ బ్రిడ్జిని నిర్మించి, 3 ప్లాట్ ఫామ్లకు 3 లిఫ్ట్‌లు ఏర్పాటు చేయాలని జిఎంను కోరారు. కేరళ ఎక్స్‌ప్రెస్ కు కాగజ్ నగర్ లో హాల్టింగ్ ఇవ్వాలని, అలాగే చర్లపల్లి నుండి హౌరా వరకు సిర్పూర్ కాగజ్నగర్ మీదుగా కొత్త రైలు నడపాలని, తద్వారా ఈ ప్రాంతంలో నివాసం ఉంటున్న బెంగాలీలకు మెరుగైన రవాణా సౌకర్యం ఏర్పడుతుందని తెలిపారు. సానుకూలంగా స్పందించిన జనరల్ మేనేజర్ కాగజ్నగర్ రైల్వే స్టేషన్ అభివృద్ధికి రూ . 20 కోట్లు కేటాయిస్తున్నామని, రైల్వే స్టేషన్ ను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భాజపా జిల్లా అధ్యక్షులు ధోని శ్రీశైలం, రైల్ సేవా సమితి అధ్యక్షులు ప్రయాగ్ తివారి, మండల అధ్యక్షులు కుంచాల విజయ్, మాజీ కౌన్సిలర్లు దెబ్బటి శ్రీనివాస్, అరుణ్ లోయ, పవన్ బల్దేవ, సంతోష్, అనిల్ మరియు రైల్వే అధికారులు పాల్గొన్నారు.

# సింగరేణి పరిరక్షణ ఏఐటీయూసీతోనే సాధ్యం

**కార్మిక సంఘాలు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలి - ఏఐటీయూసీ నాయకులు ముస్కె సమ్మయ్య, ఎస్‌కె బాజీ సైదా**

నస్పూర్, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త




కార్మికుల హక్కుల సాధన, సింగరేణి పరిరక్షణ ఏఐటీయూసీతోనే సాధ్యమని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) డిప్యూటీ జనరల్ సెక్రటరీ ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కె బాజీ సైదాలు అన్నారు. శనివారం నస్పూర్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, ఈ ఏడాది మార్చి 7న జరిగిన సీఎండీ స్థాయి స్ట్రక్చరల్ సమావేశంలో యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లిన కార్మికుల సమస్యల పరిష్కారంలో యాజమాన్యం ప్రదర్శిస్తున్న అలసత్వాన్ని నిరసిస్తూ ఈనెల 12న జరగాల్సిన సీఎండీ స్థాయి స్ట్రక్చరల్ సమావేశాన్ని బహిష్కరించినట్లు తెలిపారు. సింగరేణిలో కార్మిక సంఘాలు మనుగడ సాధించాలంటే ఐక్య పోరాటాలకు సిద్ధం కావాల్సిన ఆవశ్యకత ఉందని అన్నారు. సింగరేణి సీఎండీ రాజకీయ నాయకుల మెప్పుకోసం పనిచేస్తున్నారని, సింగరేణి గుర్తింపు సంఘం ప్రాధాన్యత తగ్గించాలని చూస్తున్నారని, పైరవీలు చేసే కార్మిక సంఘాల నాయకులకు ఉన్నతాధికారులు సహకరిస్తున్నారని ఆరోపించారు. స్ట్రక్చరల్ మీటింగ్‌లో అగ్రిమెంట్ అయిన అంశాలకు సర్కులర్స్ రావడంలేదని, కొత్త అంశాలు ఒప్పుకోవడం లేదని అన్నారు. కార్మికుల హక్కుల సాధన, సింగరేణి సంస్థ మనుగడ తమకు ముఖ్యమని, కార్మికుల పెండింగ్ సమస్యల పరిష్కారానికి ఆందోళన చేపడతామని, గేట్ మీటింగ్‌లు పెట్టి కార్మికులను చైతన్య పరుస్తామని, నూతన గనులు వస్తేనే సింగరేణి మనుగడ సాధ్యమవుతుందని, కార్మికుల పెండింగ్ సమస్యల పరిష్కారానికై త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రిని కలుస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు సురేష్, గొర్రె నర్సయ్య, సుధాకర్, లచ్చన్న, గండి సతీష్, అఫ్రోజ్ ఖాన్, పెద్దన్న, శంకరయ్య, సారయ్య, ఆడెపు సురేష్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# యాజమాన్యం కాలయాపనపై ఏఐటీయూసీ ఆగ్రహం

రామకృష్ణాపూర్, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త



సింగరేణి యాజమాన్యం కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో కాలయాపన చేస్తోందని ఏఐటీయూసీ సెంట్రల్ సెక్రటరీ అక్బర్ అలీ తీవ్రస్థాయిలో విమర్శించారు. శనివారం రామకృష్ణాపూర్ సిహెచ్‌పి ప్రాంగణంలో జరిగిన ద్వార సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో డైరెక్టర్ (పా), సీఎండీతో జరిగిన సమావేశాల్లో నిర్ణయాలు తీసుకున్నా వాటిని అమలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సొంతింటి పథకం కమిటీ ఏర్పాటైనా ఒక్కసారికీ సమావేశం జరగలేదని, 2009లో కార్మికులు నిరాకరించిన పథకాన్ని ఇప్పుడు తప్పనిసరిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. మెడికల్ బోర్డు 10 ఏళ్లుగా సజావుగా నడుస్తున్నా, ఏసీబీ పేరుతో అడ్డుకోవడం యాజమాన్యం చేసిన తప్పు అని ఆయన పేర్కొన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరం లాభాలను ప్రకటించి, అందులో 35 శాతం కార్మికులకు వాటా కేటాయించాలని డిమాండ్ చేశారు. పెర్క్స్‌పై రికవరీ చేసిన ఇన్కమ్ టాక్స్‌ను కోల్ ఇండియా మాదిరిగా రీఫండ్ చేయాలని కోరారు. ఇక సింగరేణిలో ఎన్నడూ లేని ట్రాన్స్‌ఫర్ పాలసీ కార్మికులకు ఇబ్బందులు పెడుతోందని విమర్శించారు. ఈపి ఆపరేటర్లకు వాగ్దానం చేసిన గ్రేడ్స్ ఇప్పటివరకు ఇవ్వలేదని, డిస్మిస్ కార్మికులకు మరోసారి అవకాశం ఇవ్వాలని, 2018లో పెండింగ్‌లో ఉన్న డిపెండెంట్ ఎంప్లాయిమెంట్ కేసులను 2020 నిబంధనల ప్రకారం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికులకు హైపవర్ వేతనాలు చెల్లించాలని అన్నారు. సమావేశంలో ఇప్పకాయల లింగయ్య, హరి రామకృష్ణ, మాదాసి వేణుగోపాల్, అబ్బాస్, శ్రీధర్ రావు, దూత భాస్కర్, డొక్కు శ్రీనివాస్, మండల శ్రీనివాస్, గోవర్ధన్ రెడ్డి, ఆవుల మల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి ఉద్యోగుల రాకపోకలకు బస్సు సౌకర్యం

బెల్లంపల్లి, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త



గోలేటి క్రాస్ రోడ్డు నుండి ఖైరిగర ఉపరితల గని వరకు ఉద్యోగుల రాకపోకలకు బస్సు సౌకర్యాన్ని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం. విజయ భాస్కర్ రెడ్డి శనివారం రోజున ప్రారంభించారు. మూడు షిఫ్ట్‌ల ఉద్యోగులను విధులకు తీసుకెళ్లడంతో పాటు తిరిగి ఇంటికి వెళ్లేందుకు గోలేటి క్రాస్ రోడ్డు వరకు వెళ్తుంది. ఐదేళ్ల పాటు ఈ బస్సు సేవలు కొనసాగుతాయని జనరల్ మేనేజర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఓ మచ్చగిరి నరేందర్, ప్రాజెక్ట్ ఇంజినీర్ వీరన్న, మేనేజర్ జె శంకర్, సంక్షేమ అధికారి రజినీకుమార్, ఏఐటియుసి నాయకుడు ఓదెలు తదితరులు పాల్గొన్నారు.

## 3 వేల 500 కేసుల పరిష్కారం

నస్పూర్, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త

జాతీయ అదాలత్ కార్యక్రమంలో జిల్లాలోని అన్ని న్యాయస్థానాలకు సంబంధించిన 3 వేల 500 కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరించడం జరిగిందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్ వీరయ్య ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం రోజున దేశ అత్యున్నత న్యాయస్థానం ఆదేశానుసారం దేశవ్యాప్తంగా నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి ఎ. నిర్మల, సీనియర్ సివిల్ జడ్జ్ డి. రామ్ మోహన్ రెడ్డి, జూనియర్ సివిల్ జడ్జిలు కవిత, నిరోష, కృష్ణ తేజ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయ మూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ మాట్లాడుతూ రాజీ మార్గంతో ఇరువర్గాల వారిని కేసుల నుండి విముక్తి పొందాలని, ఇందుకు రాజీమార్గమే రాజ మార్గమని తెలిపారు. దేశవ్యాప్తంగా నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 9 లోక్ అదాలత్ బెంచ్ లను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. లోక్ అదాలత్ వలన కక్షిదారులు సమయం వృధా కాకుండా, ఇరు వర్గాల వారు గెలిచినట్టుగా అంతిమ తీర్పుగా ఉంటుందని తెలిపారు. 3 వేల 500 కేసులలో 30 సివిల్ దావాలు, 15 మోటారు వాహన పరిహారం కేసులు, 339 క్రిమినల్ కేసులు, 43 సైబర్ క్రైములు, మద్యం సేవించి నడిపిన వాహన కేసులు, 45 ప్రిలిటిగేషన్ కేసులు, ఇతర కేసులు 3 వేల 100 కేసులు పరిష్కరించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ ప్రతినిధులు, పోలీసు శాఖ అధికారులు, కక్షిదారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నిరంతర సాధనకు ఓటముండదు

బెల్లంపల్లి, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త

క్రీడల్లో గెలుపోటములు సహజం కాని వాటిని పట్టించుకోకుండా నిరంతరం సాధన చేసే వారికి ఓటముండదని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం. విజయభాస్కర్ రెడ్డి అన్నారు. శనివారం రోజున గోలేటి సింగరేణి పాఠశాల మైదానంలో (డబ్ల్యూపిఎస్ అండ్ జిఏ) 92వ వార్షిక క్రీడా పోటీలను ముఖ్య అతిథిగా హాజరై ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ ఆట ఆడిన శారీరక ధారుఢ్యంకు సమానంగా మానసికంగా పరిపక్వత ముఖ్యమన్నారు. ప్రత్యర్థి బలాబలాలను అంచనా వేయడం కూడా క్రీడలో ముఖ్యమన్నారు. పలు ప్రాంతాల వ్యక్తుల మధ్య స్నేహ బంధాన్ని పెంపొందించడానికి క్రీడలు దోహదపడతాయన్నారు. అనంతరం డిపార్ట్ మెంటల్ వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. ఖైరిగురా పిఓ జట్టు పై ఎస్ఓ టు జిఎం జట్టు గెలుపొందింది. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి నాయకుడు బయ్య మొగిలి, అధికారుల సంఘం నాయకుడు ఉజ్వల్ కుమార్ బెహరా, ఎస్ఓ టు జిఎం కె. రాజమల్లు, డీజిఎం (సివిల్) ఎస్. కె. మదీనా బాషా, పర్సనల్ డిపార్ట్మెంట్ హెచ్ ఓడి ఎం శ్రీనివాస్, సీనియర్ పర్సనల్ అధికారి డి. ప్రశాంత్, స్పోర్ట్స్ సూపర్ వైజర్ అశోక్, స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ అన్వేష, జనరల్ క్యాప్టెన్ కిరణ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

## భద్రతల మధ్య యూరియా బస్తాల పంపిణీ

కౌటాల:సెప్టెంబర్ 13 ప్రభాతవార్త:



కౌటాల మండల కేంద్రంలోని రైతువేదికలో శనివారం పోలీస్ బందోబస్తు నడుమ యూరియా బస్తాలను రైతులకు పంపిణీ చేశారు. రైతులు ఎన్నో రోజులుగా యూరియా కోసం రైతు వేదికల చుట్టూ తిరుగుతూ ఉన్న వ్యవసాయ అధికారులు మాత్రం తమకు నచ్చిన వారికే పంపిణీ చేస్తున్నారని రైతులు ఆందోళనకు దిగారు. దీంతో సిఐ సంతోష్ అక్కడకు చేరుకుని రైతులకు నచ్చచెప్పడంతో రైతులు ఆందోళన విరమించారు. అనంతరం మండల వ్యవసాయ అధికారిణి ప్రేమలత మాట్లాడుతూ విడతల వారిగా రైతులందరికి యూరియా అందేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయునికి సన్మానం

బోథ్ సెప్టెంబర్ 13

ప్రభాతవార్త



మండలంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల నుండి ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎన్నికైన శ్రీ రామ్ ఉపాధ్యాయుడిని స్థానిక మండల విద్యాధికారి మహమ్మద్ హుస్సేన్ శనివారం ఘనంగా సన్మానించారు శ్రీరామ్ మాట్లాడుతూ విద్యార్థుల పట్ల అహర్నిశలు కష్టపడుతూ విద్యార్థులకు క్రమశిక్షణ మంచి బోధనను అందించినందుకు తనకు ఉత్తమ ఉపాధ్యాయునిగా గుర్తింపు దక్కిందని తెలిపారు ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం శశిధర్ రెడ్డి, పి జి హెచ్ ఎం గంగయ్య , సీనియర్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## తలోడిసలుగుపల్లి మధ్య రహదారిని డబుల్ రోడ్డుగా అభివృద్ధి చేయాలి

**- ఎమ్మెల్యే డా. హరీష్ బాబు**

కాగజ్‌నగర్, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త



కాగజ్‌నగర్ పట్టణంలో ఎమ్మెల్యే నివాసంలో శనివారం రహదారులు,భవనాల శాఖ చీఫ్ ఇంజినీర్ (బిల్డింగ్స్ సిఆర్ఐఎ) రాజేశ్వర్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తలోడి, సలుగుపల్లి మధ్య ఉన్న సింగిల్ రోడ్డును డబుల్ రోడ్డుగా అభివృద్ధి చేయాలని కోరారు. తద్వారా కౌటాల, చింతలమానేపల్లి, బెజ్జూర్ మండలాలకు పూర్తిగా డబుల్ రోడ్డు సౌకర్యం అందుతుందని ఆయన పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులైన సెంట్రల్ రోడ్డు ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ (సిఆర్ఐఎఫ్) కింద ఈ నిధులు మంజూరు చేయించడానికి కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని తాను ఒప్పిస్తానని వెంటనే సర్వే పూర్తి చేసి ప్రతిపాదనలు పంపించాలని ఎమ్మెల్యే కోరారు. సానుకూలంగా స్పందించిన చీఫ్ ఇంజినీర్ తగు ఆదేశాలు ఇస్తామని తెలిపారు.

## సొంత నిధులతో మరమ్మతులు

బోథ్, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త




బోథ్ మండలం దన్నూర్ గ్రామం కురుస్తున్న భారీ వర్షాల కారణంగా చెడిపోయిన రోడ్డు బ్రిడ్జిలను శనివారం సామాజిక సేవకుడు చట్ల ఉమేష్ , వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డిలు తమ సొంత నిధులతో రోడ్డుపై ఎర్ర మొరం పోయించి వచ్చిపోయే వాహనాలకు ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చేశారు. అలాగే భారీ వర్షాలకు వర్షపు నీటిలో కొట్టుకు వచ్చిన చెత్త చెదారాన్ని జెసిబి సహాయంతో తొలగించారు. ఒకవైపు బోథ్ మండలంలో అనేక సామాజిక సేవలు చేస్తూ మరోవైపు ఏ గ్రామస్తులైన ఫోన్ చేసి సమస్య వివరిస్తే ఆ సమస్యకు పరిష్కారం చూపుతున్న చట్ల ఉమేష్ ను ధనూర్ బి గ్రామస్తులు ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఇంద్రారెడ్డి, అబ్రార్, వినయ్, తదితరులు పాల్గొన్నారు.

## యూరియా కోసం బారులు తీరిన రైతులు

తిర్యాని,సెప్టెంబర్13,ప్రభాతవార్త:



తిర్యాని మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద యూరియా కోసం శనివారం ఉదయం నుంచే రైతులు భారీగా బారులు తీరారు. ఇటీవల గోదాంలోకి యూరియా నిల్వలు చేరుకోవడంతో పిఎసిఎస్ అధికారులు నేడు దాని పంపిణీ ప్రారంభించారు. ఉదయం 7 గంటల నుంచే రైతులు సంఘం కార్యాలయం వద్ద లైన్లలో నిలబడి వేచి చూశారు.గత కొద్దిరోజులుగా యూరియా కొరతతో ఇబ్బందులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న తరుణంలో యూరియా అందుతుందన్న వార్తతో కార్యాలయానికి రైతులు పరుగులు తీశారు.కాగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండేందుకు తిర్యాని ఎస్ఐ వెంకటేష్ నేతృత్వంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.పంపిణీని శాంతియుతంగా నిర్వహించేందుకు విడతలవారీగా యూరియా అందజేస్తామని పిఏసిఎస్ చైర్మన్ చుంచు శ్రీనివాస్ తెలిపారు.